క్లుప్తంగా

చింతలపాలెం ఏఓగా దార శశాంక్



హుజూర్‌నగర్ : చింతలపాలెం మండల వ్యవసాయ అధికారిగా దార శశాంక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చింతపాలెం ఇన్‌చార్జ్ ఏఓ బదిలీ కావడంతో సంగారెడ్డి రైతు శిక్షణ కేంద్రంలో ఏఓగా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

యూ జీనియస్ క్విజ్‌లో కోదాడ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న తేజ విద్యాలయం విద్యార్థులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయం విద్యార్థులు వరంగల్‌లో గల అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన యూ జీనియస్ క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 320 పాఠశాలల నుంచి 640 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా ప్రిలిమినరీ పరీక్ష అనంతరం ఆరు జట్లను ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. ఆ ఫైనల్ పోటీల్లో తేజ విద్యాలయానికి చెందిన నవీన్‌కుమార్, సృజన్‌గుప్తాలు ఉత్తమ ప్రతిభ చూపి తృతీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, నేరేడుచర్ల క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీఆర్‌ఎస్ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, క్లబ్ సెక్రటరీ గుండ్రెడ్డి సైదిరెడ్డి, సభ్యులు చిత్రం విశ్వనాథ్, సతీష్‌రెడ్డి, నాగార్జున, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

నడిగూడెం పీఏసీఎస్ సీఈఓగా కిరణ్‌కుమార్‌రెడ్డి

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓగా బీరవల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న యలమందరావు చింతలపాలెంకు బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో ఆ సంఘం చైర్మన్ కొల్లు రామారావు, పాలకవర్గం పాల్గొన్నారు.

మేలు జాతి గేదెలతో అధిక పాల ఉత్పత్తి

నేరేడుచర్ల : మేలు జాతి గేదెల ద్వారా పాల ఉత్పత్తి అధికంగా ఉంటుందని కల్మలచెరువు పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామంలో గల రైతు వేదికలో నేరేడుచర్ల, పాలకీడు మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆయన పాడి గేదెలు, నాటు కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం కె.నాగేందర్, నేరేడుచర్ల, పాలకీడు మండలాల సీసీలు జైతురాం, ఎల్లయ్య, సైదులు, నేరేడుచర్ల మండల సమైక్య అధ్యక్షురాలు పార్వతి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి



సీనియర్ అసిస్టెంట్ కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

హుజూర్‌నగర్ : రాష్ట్రంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్, టెక్నీషియన్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జే.సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వై.సైదారావు కోరారు. ఈమేరకు శుక్రవారం హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మట్టయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లు ప్రమాదకరమైన వృత్తిలో పని చేస్తూ ఏదో ఒకచోట ప్రతిరోజూ విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారని వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సంఘం మండల కార్యదర్శి సైదులు, సభ్యులు నరేష్, కోటయ్య, వీరబాబు, రవి, మల్లయ్య, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

ప్రత్యేక పాలన.. అస్తవ్యస్తం

- గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- విషజ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- అటు వైపు చూడని ప్రత్యేక అధికారులు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దోమల వ్యాప్తితో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. హుజూర్‌నగర్ మండలంలోని అనేక గ్రామాల్లో ఏ వీధిలో చూసినా చెత్తాచెదారం పేరుకుపోయింది. తాగునీరు సక్రమంగా రావడం లేదు. సర్పంచ్‌లు ఉన్న సమయంలో ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కారమయ్యేదని, ఇప్పుడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కానీ పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. వీధుల్లో ఉన్న చెత్తను కనీసం నెలకొకసారైనా తొలగించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల వంక చూడని ప్రత్యేకాధికారులు..

ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన ప్రత్యేక అధికారులు గ్రామాల్లోకి రావడం లేదని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారులు పంచాయతీ విధులతో పాటు పలు రకాల విధులు ఉండడంతో వారు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని తెలుస్తోంది. దీంతో ఆయా పంచాయతీల పాలన కుంటుపడిపోతోంది. ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. కనీసం మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే నాథుడే కరువయ్యారని మండల ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.



బూరుగడ్డలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

విషజ్వరాల బారిన ప్రజలు..

హుజూర్‌నగర్ మండలంలో 11 గ్రామ పంచాయతీలు ఉండగా 3 ఆవాస గ్రామాలున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పల్లెల్లో ఖాళీ స్థలాలు, డ్రెయినేజీలు, రహదారుల వెంట మురుగు నీరు చేరి దోమలకు కేంద్రాలుగా మారాయి. దీంతో దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగి గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. గత నెలరోజులుగా బూరుగడ్డ, గోపాలపురం, లింగగిరి తదితర గ్రామాల్లో విషజ్వరాల బారినపడిన వారు హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రితో పాటు ఖమ్మం, హైదరాబాద్ వంటి కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. దోమలను లార్వా దశలోనే నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారులు ఇప్పటికైనా గ్రామాలపై దృష్టి పెట్టి పారిశుద్ధ్యం మెరుగుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వీధుల్లో ఫాగింగ్ చేపట్టాలి



గ్రామాల్లో దోమల నివారణకు శానిటేషన్, ఫాగింగ్ చేపట్టాలి. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యారోగ్యశాఖ అధికారులు అవగాహన కల్పించాలి. ఫీవర్ సర్వే నిర్వహించాలి. జ్వరాలు వ్యాప్తి చెందుతున్న గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

– కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాది, గోపాలపురం

సమస్యలు పరిష్కరిస్తాం



గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తాం. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులతో పాటు సంబంధిత ప్రత్యేక అధికారులను అప్రమత్తం చేశాం. ఎన్ని పనులున్నా వారికి కేటాయించిన గ్రామాల్లో పాలనపై దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పాం.

– గిరిబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, హుజూర్‌నగర్

పురాతన భవనం తొలగింపునకు అనుమతి

సాక్షి ఎఫెక్ట్..

మునగాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆర్‌అండ్‌బీ పురాతన భవనం కూలేందుకు సిద్ధంగా ఉండడమే కాక నూతన పీహెచ్‌సీ భవనానికి అడ్డుగా ఉండడంతో ఈనెల ఆరవ తేదీన సాక్షి దినపత్రికలో 'పురాతన భవనాన్ని కూల్చివేయాలి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ పి.ఖాజన్‌గౌడ్ భవనాన్ని తొలగించేందుకు అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోదాడ సబ్ డివిజన్ డీఈఈ పవన్‌కుమార్ ఇటీవల పురాతన భవనాన్ని పరిశీలించి నివేదికను ఆర్‌అండ్‌బీ ఈఈకి సమర్పించారు. దీంతో భవనాన్ని తొలగించేందుకు పనులు చేపట్టవచ్చని జిల్లా వైద్యాధికారికి ఆయన లేఖ పంపారు. అలాగే గత జూలై 27న ఇదే భవనాన్ని కూల్చివేయాలని జిల్లా ఉన్నతాధికారులకు జిల్లా వైద్యాధికారి డా. కోటాచలం లేఖ పంపారు. ఎట్టకేలకు భవనం కూల్చివేసేందుకు అనుమతి రావడంతో వైద్యశాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కాగా, భవనాన్ని వీలైనంత త్వరగా కూల్చివేయాలని సామాజిక కార్యకర్త గంధం సైదులు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను కోరారు.



మునగాల పీహెచ్‌సీ ఆవరణలోని పురాతన భవనం

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి కరివిరాల మోడల్ స్కూల్‌కు చెందిన ఎ.తనుశ్రీ, ద్వితీయ బహుమతి నడిగూడెం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్.ఉమేరా, తృతీయ బహుమతి నడిగూడెం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి టి.ప్రసన్న గెలుపొందారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి నడిగూడెం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్.నాస్మిన్, ద్వితీయ బహుమతి నడిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థి పి.కృష్ణవేణి, తృతీయ బహుమతి కరివిరాల మోడల్ స్కూల్‌కు చెందిన షేక్.భాషిరత్ గెలుచుకున్నారు. విజేతలకు బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలు ఈ నెల 27న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. సీఆర్పీలు నందిగామ రామారావు, రాజుల గురుస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

చిలుకూరు : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం విద్యాశాఖ, వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ స్థాయిలో నిలిచిన గ్రూపును జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీల్లో బేతవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సలీం షరీఫ్, ఎంఎస్‌ఓ యం.గురవయ్య, ప్రధానోపాధ్యాయుడు జి.ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిలుకూరు : విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

30 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

నేరేడుచర్ల : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి మండల స్థాయి బాలబాలికల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి చత్రునాయక్ తెలిపారు. శుక్రవారం ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయి అండర్- 14, అండర్- 17 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 30న బాలికలు, 31న బాలురకు స్థానిక రామాపురం బీసీ గురుకుల పాఠశాలలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఇంజమూరి కాటయ్య, కొండా లింగయ్య, ఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి ఏసుపాదం, వ్యాయామ ఉపాధ్యాయులు భాస్కర్, శ్రీనివాస్, సుభాషిణి, సునిత, వెంకటేశ్వర్లు, రవి తదితరులు ఉన్నారు.

రుణమాఫీ కోసం రైతుల అవస్థలు

మునగాల : రూ.రెండు లక్షల రుణమాఫీ కాని రైతులు అయోమయానికి గురవుతున్నారు. రుణమాఫీ కాని రైతులు అన్ని వివరాలతో కూడిన దరఖాస్తును స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో నోడల్ అధికారికి ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించడంతో గత ఐదు రోజులుగా మునగాల మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. గత సోమవారం నుంచి శుక్రవారం వరకు మండల వ్యాప్తంగా సుమారు 400 మంది రైతులు రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ప్రతిరోజు 50 మందికి పైగా దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయానికి వస్తున్నారని వ్యవసాయాధికారి, రుణమాఫీ నోడల్ అధికారి బుంగా రాజు తెలిపారు. రేషన్‌కార్డు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ కాని రైతులు తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసి కార్యాలయంలో ఇవ్వాలని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉండి రూ.రెండు లక్షల రుణం కన్న ఎక్కువ తీసుకున్న రైతులు వచ్చే నెల ఒకటవ తేదీ కల్లా మిగతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వచ్చే నెల ఒకటవ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇవ్వనున్నదని వ్యవసాయాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగాల క్లస్టర్ విస్తరణాధికారి రమ్యతేజ పాల్గొన్నారు.



వ్యవసాయ కార్యాలయంలో రుణమాఫీకి దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

రంగ స్థల కళలను కాపాడుకోవాలి

హుజూర్‌నగర్ : రంగ స్థల కళలను కాపాడుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ జానపద జాతర సంబురాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే కోత్సవాలను శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను ప్రజలు ఆదరించినప్పుడే అవి సజీవంగా ఉంటాయని అన్నారు. మంత్రి ఉత్తమ్ సహకారంతో కళాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. అనంతరం పలువురు కళాకారులను సన్మానించారు. అంతకు ముందు పట్టణంలో కళాకారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ, దామోదర్, కంబాల శ్రీనివాస్, చప్పిడి భిక్షం, గోపనబోయిన వెంకటేశ్వర్లు, కొట్టు బాబు, జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జానపద సంబురాలను ప్రారంభించి మాట్లాడుతున్న వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

మఠంపల్లి : మఠంపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్.విజయ.. సిబ్బందితో కలిసి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా గల ప్లాట్లలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మఠంపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో 986 ప్లాట్లకు, మరో 2 వెంచర్లకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులపై క్రమ పద్ధతిలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. కాగా, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చూడాలని పలువురు గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ జేఏ మట్టయ్య, బిల్ కలెక్టర్ అన్వర్, సీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని వార్డుల్లో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని, దోమల మందు పిచికారీని ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసాద్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కోదాడరూరల్ : కోదాడ ప్రాంతంలో సీపీఎం, ప్రజా సంఘాల నిర్మాణానికి కుక్కడపు ప్రసాద్ ఎంతో కృషి చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కుక్కడపు ప్రసాద్ 4వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ సూర్యనారాయణ, జుట్టుకొండ బసవయ్య, దేవరం వెంకటరెడ్డి, జె.నరసింహరావు, ఎం.రాంబాబు, ఎం.ముత్యాలు, నాగటి రాములు, షేక్.సైదా, ఏనుగుల వీరాంజనేయులు, కుక్కడపు నళిని, దాసరి శ్రీనివాస్ ఉన్నారు.

డీఏలు విడుదల చేయాలి



గుర్రంబోడుతండాలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వాలు అందజేస్తున్న దామోదర్

మఠంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీ అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ దామోదర్ కోరారు. శుక్రవారం మఠంపల్లి, గుర్రంబోడుతండాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆ సంఘం సభ్యత్వాలను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రేపాకుల రామకృష్ణ, కిరణ్, రాజశేఖర్‌రెడ్డి, చిక్కుళ్ల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మోతె : మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన లబ్ధిదారులు గన్నారపు వెంకటరెడ్డి, ఎస్‌కే ఖాసీం, గునగంటి వెంకటమ్మలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ

మఠంపల్లి : మండలంలోని పాతదొనబండతండా, జామ్లాతండా, చెన్నాయిపాలెం, కిందితండాలలో ఓటరు జాబితా సవరణను శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు చేపట్టారు. ఒకే జాబితాలో ఉన్న రెండు మూడు గ్రామాల ఓటర్లను ఏ గ్రామానికి ఆ గ్రామంగా సరిచేయడం, ఒకే కుటుంబం ఒకే వార్డులో ఉండే విధంగా చూడటం వంటి సవరణలు చేపట్టారు. కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ : ఓటరు జాబితా సవరణ కోసం నిర్వహించే ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో నియోజకవర్గంలోని బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బందికి ఓటరు జాబితా సవరణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఓటరు జాబితా సవరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సవరణ చేయాలని చెప్పారు. స్టేట్ లెవల్ మాస్టర్ ట్రైనర్ విప్పర్ల రమేష్ జాబితా సవరణ, తప్పులు లేకుండా డేటాను ఎంటర్ చేయడం తదితర విషయాలపై ప్రొజెక్టర్ ద్వారా బీఎల్‌ఓలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



బీఎల్‌ఓల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



కోదాడరూరల్ : ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



మునగాల : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మునగాల : అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీని వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇంకా 60 శాతం రైతులకు రుణమాఫీ అందలేదని, షరతులను సడలించి పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలను వెంటనే ఇవ్వాలని కోరారు. రైతులకు పెట్టుబడి సాయంగా రైతుభరోసాను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు చందా చంద్రయ్య, కార్యదర్శి డి.స్టాలిన్ రెడ్డి, రైతు సంఘం నాయకులు మండవ వెంకటాద్రి, సుంకర పిచ్చయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ బచ్చలకూరి స్వరాజ్యం, రైతు సంఘం మండల నాయకులు మల్లారెడ్డి, కోటి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు నాగారపు పాండు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ అధికారి రమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌కార్డు నిబంధన, పేర్లు తప్పులు ఉన్నాయని రకరకాల కారణాలతో వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతుల రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్గి బ్రహ్మం, ప్రజా సంఘాల నాయకులు వి.సైదులు, పాండునాయక్, బాలునాయక్, ఆర్.మురళి, పి.వెంకటనారాయణ, పి.వెంకటరెడ్డి, వీరమల్లు, వెంకన్న, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : షరతులు లేకుండా పట్టాదారు పాస్‌పుస్తకంపై రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కోదాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. అనంతరం ఆర్డీఓ కార్యాయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జుట్టుకొండ బసవయ్య, దేవరం వెంకటరెడ్డి, సైదా, ఆంజనేయులు, బీమయ్య, రాములు, శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నేరేడుచర్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

నేరేడుచర్ల : కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ విధానాన్ని రద్దు చేసి ఓపీసీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు ఎం.సైదులు, ప్రణతి, శ్రీనివాస్, వెంకన్న, నర్సింహాచారి, దుర్గయ్య, ఖాన్, బేగం, అంజయ్య, ప్రసాద్, నరేందర్, సునిత, నర్సింహారావు ఉన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పలువురు అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జానిపాషా, శ్రీధర్, కృష్ణ, మహేష్, ఈశ్వర్, వెంకటేశ్వరరావు, ఉపేందర్, నాగరాజు, శ్రీనివాస్, శ్రీనివాసరావు, వీరన్న, మదార్, రాములు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



నడిగూడెం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కోదాడ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగులు కోరారు. శుక్రవారం కోదాడలో సీపీఎస్ ఉద్యోగులు బ్లాక్‌డేను పాటించారు. భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి జీఓ నంబర్ 28 ప్రతులను చింపివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనంతరం కనీస జీవిత భద్రత లేకపోవడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, దీంతో సీపీఎస్ ఉద్యోగులు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారని, ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జానకిరామ్, ముక్తార్, విజయ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

చిలుకూరు : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చిలుకూరు మండలంలోని రామాపురంలో గల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌జీ.శివకుమారి, ఉపాధ్యాయులు స్వామి, చందా రాములు, వెంకటరెడ్డి, అరుంధతి, వెంకన్న, బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కోదాడ : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



చిలుకూరు : రామాపురంలో..

మట్టపల్లిలో నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, శ్రీస్వామి మూలవిరాట్‌కి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ తంతు పూర్తిగావించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కోదాడ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీజీఆర్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ యాశాల వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ బాలుర పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, యంగ్ ఎర్త్ లీడర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఎంఈఓ సలీంషరీఫ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ సంస్థ పని చేస్తుందని తెలిపారు. ప్రతి పాఠశాలకు ఔషధ మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరాజ్, శంకరయ్య, మార్కెండేయ, బడుగుల సైదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు